క్లుప్తంగా

శిర్సవాడ చేరుకున్న సత్యశోధన పాదయాత్ర

తాడూరు: ఉమ్మడి జిల్లా రిటైర్డ్ డీఈఓ విజయ్ కుమార్ చేపట్టిన బాపుబాటలో సత్యశోధన పాదయాత్ర మంగళవారం మండలంలోని శిర్సవాడకు చేరుకుంది. 100 రోజుల్లో 1000 కిలోమీటర్ల పాదయాత్రలో భాగంగా గ్రామాన్ని చేరుకున్న విజయ్ కుమార్‌ను గ్రామంలోని లక్ష్మీ నరసింహస్వామి దేవాలయంలోకి ఆహ్వానించి పూజారి జగదీశ్వరాచారి ప్రత్యేక పూజలు నిర్వహించడంతో పాటు ఆయనను సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ బ్రహ్మచారి, గ్రామస్తులు పాల్గొన్నారు.

హ్యాపీ.. హ్యాపీగా


అచ్చంపేటలో కేక్‌లు కొనుగోలు చేస్తున్న యువకులు


కల్వకుర్తిలో..

సాక్షి, నెట్‌వర్క్: జిల్లా వ్యాప్తంగా మంగళవారం 2024 సంవత్సరానికి వీడ్కోలు చెప్తూ 2025కు స్వాగతం పలికారు. పలు కాలనీలు, వీధుల్లో కేక్‌కట్ చేసి ఒకరికొకరు నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముగ్గులు వేసేందుకు మహిళలు రంగులు కొనుగోలు చేశారు. యువతీ, యువకులు కేరింతలు కొడుతూ వీధుల్లో సందడి చేశారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నారు. ప్రధాన రహదారి, చౌరస్తాలలో తనిఖీలు చేశారు.


నాగర్‌కర్నూల్‌లో కేక్ కట్ చేస్తున్న యువకులు


రంగులు కొనుగోలు చేస్తున్న మహిళలు

వరిధాన్యం కొనుగోలు కేంద్రం తనిఖీ



లింగాల: మండల కేంద్రంలో సింగిల్‌విండో కార్యాలయం దగ్గర ఉన్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జిల్లా వ్యవసాయాధికారి ఎం.చంద్రశేఖర్ ఆకస్మిక తనిఖీ చేశారు. రైతులు కేంద్రానికి తీసుకొచ్చిన ధాన్యం తేమ శాతాన్ని ఆయన పరిశీలించారు. సీఈఓ పాండు, ఏఈఓలు రవి, భరత్‌కుమార్, రైతులు పాల్గొన్నారు.

అభివృద్ధి పనుల పరిశీలన



కల్వకుర్తి టౌన్: పట్టణంలోని పలు వార్డులలో జరుగుతున్న అభివృద్ధి పనులను మున్సిపల్ చైర్మన్ సత్యం కౌన్సిలర్లతో కలిసి మంగళవారం పరిశీలించారు. టీయూఎఫ్ఐడీసీ కింద 14,16 వార్డులలో చేపడుతున్న పనుల పురోగతిని తెలుసుకొని, పనులను నాణ్యతతో త్వరితగతిన చేపట్టాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట వైస్ చైర్మన్ షాహెద్, మున్సిపల్ కౌన్సిలర్లు శ్రీశైలం, మంజుల, బాలు, ఎజాస్, కమిషనర్ మహమూద్ షేక్, ఏఈ షబ్బీర్, నాయకులు ఆనంద్ కుమార్, ఆయా కాలనీవాసులు ఉన్నారు.

కబడ్డీ క్రీడాకారులకు అండగా ఉంటా

కల్వకుర్తిరూరల్: కబడ్డీ క్రీడాకారులకు అండగా ఉంటానని నాగర్‌కర్నూల్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షుడు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. జనగామ జిల్లాలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి జూనియర్స్ విభాగంలో నాగర్‌కర్నూల్ జట్టు తృతీయస్థానం సాధించింది. ఈ సందర్భంగా మంగళవారం మార్చాల సమీపంలో కబడ్డీ క్రీడాకారులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి యాదయ్య గౌడ్, ఉపాధ్యక్షులు శ్రీనివాస్, రమేష్, మోహన్ లాల్, ప్రకాశ్, కోచ్ గణేష్, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాష్ట్ర డైరెక్టర్‌గా ఎర్ర చిన్నయ్య

పెద్దకొత్తపల్లి/చారకొండ: టీఎస్‌యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ కుటుంబ సంక్షేమ నిధి పథకం స్టేట్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్‌గా చారకొండ మండలంలోని చంద్రయాన్‌పల్లి గ్రామానికి చెందిన ఎర్ర చిన్నయ్యను నల్లగొండ జిల్లాలో యూటీఎఫ్ రాష్ట్ర మహాసభలో ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా పెద్దకొత్తపల్లి, చారకొండ మండలాలకు చెందిన ఉపాధ్యాయులు, ఆ సంఘం నాయకులు మంగళవారం హర్షం వ్యక్తం చేశారు.

ఆర్డీఓకు వినతి

కొల్లాపూర్: రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ ప్రభుత్వ ఉన్నత పాఠశాల హెచ్‌ఎం రాములుపై దాడికి పాల్పడ్డ వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని కేవీపీఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు హనుమంతు, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షుడు అశోక్‌నాయక్ డిమాండ్ చేశారు. మంగళవారం కొల్లాపూర్ ఆర్డీఓ భన్సీలాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో సేవ్యానాయక్, లక్ష్మయ్య, రాము తదితరులు ఉన్నారు.

కల్వకుర్తిరూరల్: రంగారెడ్డి జిల్లా మహేశ్వరంలో హెచ్‌ఎం రాములుపై దాడి చేసిన దుండగులపై కఠిన చర్యలు తీసుకోవాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి జిల్లా ప్రధాన కార్యదర్శి పరశురాములు డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో నిరసన ప్రదర్శన చేశారు. ఆంజనేయులు, బాల్‌రెడ్డి, కిషోర్, పర్వతాలు, మల్లయ్య, నెహ్రూ ప్రసాద్, రామేశ్వరయ్య తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు విద్యార్థిని ఎంపిక

అమ్రాబాద్: నాగర్‌కర్నూల్ జిల్లా పదర మండల కేంద్రానికి చెందిన బీనమోని మధుప్రియ జాతీయస్థాయి స్కూల్‌గేమ్స్ అథ్లెటిక్ పోటీలకు ఎంపికైంది. హైదరాబాద్ జింఖాన గ్రౌండ్‌లో సోమవారం నిర్వహించిన అండర్–19 రాష్ట్రస్థాయి స్కూల్‌గేమ్స్‌లో నల్లగొండ జిల్లా డిండి మండలం గురుకుల సాంఘిక సంక్షేమ క్రీడా అకాడమీలో శిక్షణ పొందుతున్న మధుప్రియ మూడు మీటర్ల పరుగు పందెంలో మొదటి స్థానం, 1500 మీటర్ల పరుగుపందెంలో ద్వితీయస్థానం నిలిచింది. ఝార్ఖండ్ రాష్ట్రం రాంచిలో జనవరి 4న నిర్వహించే జాతీయ స్థాయి పోటీలలో పాల్గొననుంది. ప్రస్తుతం కొల్లాపూర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో పదవతరగతి చదువుతున్న మధుప్రియ మారుమూల ప్రాంతం నుంచి జాతీయ స్థాయికి ఎంపిక కావడంపై గ్రామస్తులు, తల్లిదండ్రులు బీనమోని భిక్షపతి, వెంకటమ్మ హర్షం వ్యక్తం చేశారు.

ఇళ్ల స్థలాలు ఇవ్వాలని ధర్నా

పెంట్లవెల్లి: మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట మంగళవారం సీపీఎం ఆధ్వర్యంలో పేదలకు ఇళ్ల స్థలాలు, ఇళ్లు, సాగుభూములు ఇవ్వాలని ధర్నా నిర్వహించారు. అనంతరం తహసీల్దార్ జయంతికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా అధ్యక్షుడు ఈశ్వర్ మాట్లాడుతూ ప్రభుత్వం చేసిన సర్వే ప్రకారం పేదలను గుర్తించి వారికి ఆదుకోవాలన్నారు. భూమి లేని వారికి భూమి ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో హనుమంతు, తిమ్మస్వామి, ఆదిలక్ష్మి, ప్రమీల, సురేష్, లక్ష్మీ గోవిందమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను రక్షించాలి



అచ్చంపేట రూరల్: ప్రభుత్వ భూములు కబ్జాలకు గురి కాకుండా అధికారులు రక్షించాలని బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చందులాల్‌చౌహాన్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆర్డీఓ కార్యాలయంలోని ఓ అధికారికి, మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. మున్సిపాలిటీ పరిధిలోని సర్వేనంబర్ 293లో గల ప్రభుత్వ గైరాన్ 4.32 ఎకరాల భూమిని కొంతకాలంగా ప్రభుత్వ అనుమతి లేకుండా కొందరు ప్రైవేట్ వ్యక్తులు చదును చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో బీజేపీ యువమోర్చా నాయకులు అఖిల్ రెడ్డి, సురేష్, అనీల్ పాల్గొన్నారు.

రైతులందరికి రుణమాఫీ చేయాలి

కల్వకుర్తిరూరల్: రైతులందరికి రుణమాఫీ చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకుడు బండెల రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు. మంగళవారం మండలంలోని వెంకటాపూర్‌లో ఆయన విలేకరులతో మాట్లాడారు. గ్రామానికి చెందిన 93 మంది రైతులకు రుణమాఫీ కాలేదన్నారు. ఒక్క గ్రామంలోనే పరిస్థితి ఇలా ఉంటే రాష్ట్ర వ్యాప్తంగా ఎలా ఉంటుందో అర్థమవుతోందన్నారు.

మున్సిపల్ దుకాణాలకు వేలం

కల్వకుర్తి టౌన్: మున్సిపాలిటీ ఆధ్వర్యంలో కూరగాయల మార్కెట్‌లో నిర్వహిస్తున్న దుకాణ సముదాయంలోని కొన్ని దుకాణాలకు మంగళవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని సమావేశ మందిరంలో వేలం నిర్వహించారు. 2వ దుకాణానికి అద్దె కోసం ప్రవీణ్‌కుమార్ రూ.24,100లకు , 5వ నంబర్ దుకాణానికి అద్దెకు మాజిద్ రూ.27,365లకు, 13వ నంబర్ దుకాణానికి ప్రదీప్ రూ. 33,000లకు దక్కించుకున్నారు. వేలంలో మున్సిపల్ చైర్మన్ సత్యం, వైస్ చైర్మన్ షాహెద్, కమిషనర్ మహమూద్ షేక్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

కల్వకుర్తిరూరల్: మండలంలోని తర్నికల్ తండాకు చెందిన సీత్యా ఇల్లు విద్యుదాఘాతంతో దగ్ధమవడంతో ఐక్యతా ఫౌండేషన్ చైర్మన్ సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి రూ.10వేల ఆర్థికసాయాన్ని బాధితులకు మంగళవారం అందజేశారు. అనిల్‌గౌడ్, . బాలరాజు, రాజునాయక్, రాజు, చంద్రు పాల్గొన్నారు.

డాక్టర్ అనురాధ జన్మదిన వేడుకలు

అచ్చంపేట రూరల్: ఎమ్మెల్యే డాక్టర్ వంశీకృష్ణ సతీమణి డాక్టర్ అనురాధ జన్మదిన వేడుకలను మంగళవారం శ్రీశైల ఉత్తర ముఖద్వారమైన ఉమామహేశ్వర క్షేత్రం, అచ్చంపేటలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మండలంలోని బొల్లట్‌పల్లి స్టేజీ సమీపంలోని లెనిటీ ఫౌండేషన్ వృద్ధాశ్రమంలోని వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే సీబీఎం చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నూతన అంబులెన్స్‌ను ప్రారంభించారు.

లింక్ ఓపెన్ చేయడంతో నగదు మాయం

నాగర్‌కర్నూల్ క్రైం: వాట్సప్‌కు వచ్చిన లింక్‌ను ఓపెన్ చేయడంతో సైబర్‌నేరగాళ్లు నగదును చోరీకి పాల్పడిన ఘటన మంగళవారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం జిల్లా కేంద్రానికి చెందిన మహ్మద్ మాసూం ఫోన్‌కు ఈ నెల 9న వాట్సప్‌లో బ్యాంకు లింక్ వచ్చింది. దీనిని ఓపెన్ చేయడంతో బ్యాంక్ ఖాతా నుంచి రూ. 29500 నగదు మాయం అయ్యాయి. దీంతో బాధితుడు మోసపోయినట్లు గుర్తించి స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తుచేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు: కేసు నమోదు

అమ్రాబాద్: పదర మండలం ఇప్పలపల్లిలో మంగళవారం సారా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ దాడులలో 1000 లీటర్ల సారా తయారీకి సిద్ధం చేసిన బెల్లం ఊటతో పాటు 10 లీటర్ల సారాను ధ్వంసం చేశారు. వడ్త్య జ్యోతిపై కేసు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సీఐ కృష్ణ, ఎస్‌ఐ సతీష్‌లు తెలిపారు.

ద్విచక్రవాహనాల దొంగకు రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: ద్విచక్రవాహనాలు చోరీకి పాల్పడుతున్న దొంగను మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన విష్ణువర్ధన్‌రెడ్డి ఈనెల 30న పాత మార్కెట్లో తన బైక్‌ను నిలిపి ఉంచగా చోరీకి గురైంది. బాధితుడు సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈమేరకు బైక్‌ను ఎత్తుకెళ్లిన జంగం మధుకుమార్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని కోర్టులో హాజరుపర్చి రిమాండ్‌కు తరలించారు.

నిందితుడికి రిమాండ్

నాగర్‌కర్నూల్ క్రైం: గంజాయి విక్రయిస్తున్న వ్యక్తిని పట్టుకుని మంగళవారం రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపారు. వివరాలు.. జిల్లా కేంద్రానికి చెందిన సాయిరాం హైదరాబాద్‌లోని దూళ్‌పేట నుంచి గంజాయిని తీసుకువచ్చాడు. స్థానిక డబుల్ బెడ్‌రూం ఇళ్ల వద్ద విక్రయిస్తుండగా పక్కా సమాచారంతో పోలీసులు అతడిని అదుపులోకి తీసుకున్నారు. 90గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిపై కేసు నమోదుచేసి కోర్టులో హాజరుపర్చగా రిమాండ్‌కు తరలించినట్లు ఎస్‌ఐ తెలిపారు.

వ్యక్తి అదృశ్యం: కేసు నమోదు

నాగర్‌కర్నూల్ క్రైం: వ్యక్తి అదృశ్యపై మంగళవారం కేసు నమోదైంది. ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాల ప్రకారం మున్సిపాలిటీ పరిధిలోని దేశిటిక్యాల గ్రామానికి చెందిన నర్సింహా ఈ నెల 28న ఇంట్లో కుటుంబసభ్యులతో గొడవపడి ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు ఎంతవెతికినా ఆచూకీ లభించకపోవడంతో స్థానిక పోలీస్‌స్టేషన్ ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్లు ఊడ్చి నిరసన

కందనూలు: సమగ్ర ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె మంగళవారం 22వ రోజుకు చేరింది. పాత కలెక్టర్ భవనం నుంచి అంబేడ్కర్ కూడలి వరకు చీపుర్లతో రోడ్లను ఊడ్చి నిరసనను తెలిపారు. ఎస్‌ఎస్‌ఏ జేఏసీ అధ్యక్షుడు మురళి మాట్లాడుతూ ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు.

టెక్నాలజీ ఆవశ్యకతను వివరించాలి

తెలకపల్లి: విద్యార్థులకు సైన్స్ పట్ల మక్కువ కల్పిస్తూ విద్యనందించాలని త్రిదండి దేవనాథ రామానుజ జీయర్ స్వామి అన్నారు. మంగళవారం మండలంలోని గౌరెడ్డిపల్లి పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, వైదిక విజ్ఞానం, ఆధునిక విద్య తదితర అంశాల గురించి విద్యార్థులకు వివరించారు. హెచ్‌ఎం సుధాకర్‌రెడ్డి, వికాస తరంగిణి బాధ్యులు శివప్రసాద్, కొండల్, శ్రీరాం, నిరంజన్, కల్యాణ్, మల్లేష్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందాం

కల్వకుర్తిరూరల్: సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకుందామని త్రిదండి చిన్న శ్రీమన్నారాయణ రామానుజన్ జీయర్ స్వామి పిలుపునిచ్చారు. పట్టణంలోని వేంకటేశ్వర స్వామి దేవాలయంలో ఆయన పూజలు నిర్వహించారు. ఆలయ చైర్మన్ కల్వ మనోహర్ ఉన్నారు.


కల్వకుర్తిలో భక్తులతో రామానుజీయర్ స్వామి

టైల పంపిణీ

కల్వకుర్తిరూరల్: పట్టణంలోని హరిజనవాడ ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు మంగళవారం వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో షూ, టై బెల్టులు, పంపిణీ చేశారు.

బీజేపీ సభ్యత్వాలు

తాడూరు: మండల కేంద్రంలో బీజేపీ ఆధ్వర్యంలో మూడురోజుల నుంచి ఆన్‌లైన్ సభ్యత్వాలు బీజేపీ కార్యవర్గం సభ్యుడు వెంకట్‌నారాయణ ముమ్మరం చేశారు. ఇంటింటా తిరిగి వివరాలు సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. రవి, శేఖర్ పాల్గొన్నారు.

కంప్యూటర్ ప్రింటర్ వితరణ

ఉప్పునుంతల: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్‌కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు మంగళవారం పాఠశాలకు రూ. 30 వేలు విలువ చేసే కంప్యూటర్ ప్రింటర్‌ను అందజేశారు. కాలూరి శ్రీను, విష్ణువర్ధన్ యాదవ్, తిరుపతయ్య, వెంకట్రాములు, లక్ష్మణ్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ చేయొద్దు

కందనూలు: ఎస్సీ వర్గీకరణ చేపట్టొద్దని మంగళవారం ఉమ్మడి పాలమూరు జిల్లా కేంద్రానికి వచ్చిన ఎస్సీ వర్గీకరణ కమిషన్ చైర్మన్ జస్టిస్ షమీమ్ అక్తర్‌కు మాల మహానాడు నాయకులతో కలిసి తెలంగాణ మాల మేధావుల సమైక్య రాష్ట్ర అధ్యక్షుడు మాణిక్యాల చెన్నయ్య వినతిపత్రాన్ని అందజేశారు.